# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 237 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 02 ఆగస్టు 2026 | పేజీలు :4




తల్లి పాలే శిశువుకు

## తొలి టీకా..

- తల్లిపాల శ్రేష్ఠతను గుర్తించాలి
- మంత్రి సీతక్క

3



## ఉప్పల్ నల్ల చెరువుకు

# మహార్దశ

హైడ్రా పునరుద్ధరణతో జలకళ

3



## కొత్త శిఖరాలకు తెలంగాణ

# ఆర్థికాభివృద్ధి

- తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు1(మన చౌరాస్తా) :** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## రికార్డు స్థాయిలో వాణిజ్య పన్నుల ఆదాయం

తెలంగాణ వాణిజ్యపన్నుల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. గత నెలలో జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ కలిపి రూ.7,865 కోట్లు వసూలైంది. ఇది రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చరిత్రలోనే అత్యధిక ఆదాయం. గతేడాది జులైతో పోలిస్తే 19శాతం వృద్ధి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.5,819 కోట్లు వసూలయ్యాయి. జీఎస్టీ వృద్ధి రేటులో హరియాణా తర్వాత రెండో స్థానంలో తెలంగాణ ఉంది. దేశవ్యాప్తంగా జులైలో జీఎస్టీ వసూళ్లు 10శాతం వృద్ధి సాధించగా.. తెలంగాణలో మాత్రం 19శాతం నమోదైంది.



## జిల్లాకు విచ్చేసిన హైకోర్టు జడ్జి

**జనగామ, మన చౌరాస్తా :** హైకోర్టు న్యాయమూర్తి, జనగామ జిల్లా పోర్ట్ ఫోలియో అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా శనివారం జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చేరుకున్న న్యాయమూర్తికి పోలీసు యంత్రాంగం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం పోలీసు కమిషనర్ (సీపీ) శ్వేత, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమలు హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.





# పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా, జాతీయ భావం ఉట్టిపడేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. వేడుకల విజయవంతానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.



### బాధ్యతల కేటాయింపు..

**పరిశుభ్రత.. ఆహ్వానాలు :** కలెక్టరేట్ ఆవరణలో పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలి. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అతిథులకు సకాలంలో... సమయానికి ఆహ్వాన పత్రాలు అందజేయాలి.


**స్టాళ్లు.. నివేదిక :** వేడుకల ప్రాంగణంలో వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే స్టాల్స్ ఏర్పాటు చేయాలి. జిల్లా ప్రగతి సందేశం ప్రతులను సీపీఓ, డీపీఆర్ఓలు సంయుక్తంగా సిద్ధం చేయాలి.

**సాంస్కృతిక.. వైద్య సేవలు :** విద్యార్థులతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతను విద్యాశాఖ, వేడుకల ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహణను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టాలి.

**నిరంతర విద్యుత్.. రక్షణ :** వేడుకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ముందస్తు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలి.

**మౌలిక సదుపాయాలు :** వేదిక అలంకరణ, పూలమొక్కలు, తివాచీలు, పటిష్టమైన బ్యారికేడింగ్, మంచినీరు, స్నాక్స్ వంటి వసతులు కల్పించాలి.

**భద్రత.. పరేడ్ :** పటిష్టమైన పోలీసు బందోబస్తుతో పాటు గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలి. ఈ సమీక్షలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో రవి కిరణ్, సీపీఓ కోట్యా నాయక్, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మాజిద్ అఫ్సర్‌కు ఘన సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** మూడు దశాబ్దాలుగా మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న ప్రముఖ సామాజిక సేవకులు మాజిద్ అఫ్సర్‌ను తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (TSMESA) జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా TSMESA జనగామ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంకుషావలి మాట్లాడుతూ.. గత ముప్పై సంవత్సరాలుగా మైనారిటీల అభ్యున్నతి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మాజిద్ అఫ్సర్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందన్న ఆయన, ప్రతి ఒక్కరూ మైనారిటీల సంక్షేమం కోసం తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజిద్ అఫ్సర్ మాట్లాడుతూ.. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో కూడా మైనారిటీల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తన సేవలను గుర్తించి గౌరవించినందుకు TSMESA ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ తహసీన్, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ, మాజిద్ అఫ్సర్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అల్లాహ్ వారికి మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో TSMESA ప్రతినిధులు మహ్మద్ అంకుషావలి, మహమ్మద్ తహసీన్, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మ బంధువు సీఎం రేవంత్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవత్వానికి నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ కొనియాడారు. గత 20 ఏళ్లుగా వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియక అప్పుల పాలవుతూ కష్టాలు అనుభవించిన సుమారు 5 లక్షల మంది చిరుద్యోగుల కుటుంబాల్లో ఈ ప్రజా ప్రభుత్వం వెలుగులు నింపిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో 34 నెలలకొకసారి అరకొరగా జీతాలు పడేవని, కానీ ప్రస్తుత సీఎం సాహసోపేత నిర్ణయం తీసుకుని 1వ తేదీనే జీతాలు ఇప్పించి చిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడారని పేర్కొన్నారు. ఆగస్టు 1న వేతనాలు అందజేయడానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, విద్యాశాఖ



అధికారులకు ఆయన అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మాజీ జడ్పీటీసీ సరితను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, మన చౌరాస్తా :** అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ జడ్పీటీసీ సుంకరి సరితను జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం మాజీ ఏఎంసీ (AMC) చైర్మన్ సుంకరి మల్లేశం సతీమణి అయిన సరిత ఆరోగ్య పరిస్థితిని ఆయన నేరుగా ఆసుపత్రికి వెళ్ళి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అందిస్తున్న వైద్యం వివరాలను అక్కడి డాక్టర్లతో మాట్లాడి సమీక్షించారు. ఆమెకు మరింత మెరుగైన వైద్యం అందించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు.

# అవయవ దానం అత్యున్నతమైంది

**జనగామ, మన చౌరాస్తా :** అన్ని దానాల్లో కెల్లా అవయవ దానం అత్యున్నతమైన దని, మానవ జన్మకు మహా అవకాశమని, నేత్ర దానం తో అంధుల్లో వెలుగులు, అవయవ దానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును, దేహ దానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగపడ వచ్చునని, ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలనీ తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు డాక్టర్ అశోక్ పరికిపండ్ల పిలుపునిచ్చారు. జనగామలోని ప్రనామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్నా పరశురాములు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చనిపోయిన తర్వాత అవయవాలను కాల్చడం ద్వారా బూడిదపాలు, మట్టిలో పాతడం ద్వారా మట్టిపాలు చేయకుండా అవయవ దానం చేసి చిరంజీవులుగా మిగిలి పోవాలని తెలిపారు. భారతదేశంలో 12 లక్షల మంది అంధులు ఇంతవరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్ర దాతల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మోహన కృష్ణ భార్గవ, వయోవృద్ధుల సెంటర్ సభ్యులు లగిశెట్టి శంకర్ లింగం, మంగ భిక్షపతి, బాలరాజు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ

## హైడ్రా పునరుద్ధరణతో జలకళ

**హైదరాబాద్, ఆగస్టు 1 (మన చౌరాస్తా):** ఒకప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీటితో కళ తప్పిన ఉప్పల్ నల్లచెరువు ఇప్పుడు వర్షపు నీటితో కళకళలాడుతోంది. హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మళ్లీ జీవం పోసుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి. పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పునరుద్ధరించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. చెరువు జలవ్యవస్థను బలోపేతం చేసేందుకు నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరేలా రెండు ఇన్‌లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఆధునిక ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు. జల సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాకింగ్ ట్రాక్, బలమైన ప్రధాన కట్ట, చిన్నారుల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చి విశ్రాంతి తీసుకునే నగరంలోని ప్రధాన వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిన హైడ్రా, ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో హైదరాబాద్‌కు మరో కీలక జలవనరుగా, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.



# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఆగస్టు1(మన చౌరాస్తా) :** తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా..

- తల్లిపాల శ్రేష్టతను గుర్తించాలి
- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 1 (మన చౌరాస్తా) : పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలి.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రు పాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**